క్లుప్తంగా

అలరించిన నృత్యప్రదర్శన



కూచిపూడి నృత్యప్రదర్శన ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై విజయవాడకు చెందిన లలితాదేవి నాట్యవేద ఆర్ట్స్ అకాడమీ వారి కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. వినాయకకౌత్వం, పార్వతిపుత్ర నమో, లింగాష్టకం, తాండవం విద తాండవం, నటేశకౌత్వం, భో శంభో, మహాదేవశివ, అయిగిరినందిని తదితర గీతాలకు శివప్రియ, సాత్విక, లక్ష్మీప్రసన్న, పావని, జ్యోతి, శాంభవి, మహేశ్వరి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

దోమల నివారణ చర్యలు



ఫాగింగ్ చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కొద్దిరోజులుగా మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్న విషయం తెలిసిందే. దీనికి తోడు మూడురోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం మలేరియా నివారణ జిల్లా సబ్‌యూనిట్ అధికారి కృష్ణారెడ్డి సమక్షంలో గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఫాగింగ్ చర్యలు చేపట్టారు. వర్షపునీరు నిల్వ ఉన్నచోట, వీధుల వెంట, పచ్చిక బయళ్లు ఉన్నచోట, మురుగునీటి కుంటల వద్ద అబెట్‌ను పిచికారీ చేయించారు. అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు.

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకోవద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని తహసీల్దార్ ఉమారాణి అధికారులకు సూచించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాలకు ప్రజలు కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాల కోసం వస్తుంటారని, వారి పనిని వెంటనే చేయాలని సూచించారు. ఆలస్యం చేస్తే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలకు, ఉద్యోగాలకు అర్హత కోల్పోతారన్నారు. ఏ అధికారి కూడా ధ్రువపత్రాలు మంజూరు చేయడంలో అలసత్వం వయించరాదన్నారు.,

ఆజాదీకా అమృత్ మహోత్సవం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించారు. కళాశాల నుంచి రింగ్‌పార్క్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. దేశభక్తిని చాటండి, ఐక్యత, జాతీయతను కాపాడండి అంటూ నినాదాలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధులు, ధైర్యవంతులైన భారతీయులను స్ఫూర్తిగా తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుస్సేన్‌బాషా, అధ్యాపకులు పద్మ, రాజన్న, శివనాగిరెడ్డి, పూర్ణేశ్వరరెడ్డి, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు



బ్రాహ్మణకొట్కూరు గ్రామం వద్ద ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు

నందికొట్కూరు: పగిడ్యాల మండలం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు మండలంలోని ఇండస్ట్రియల్ కంపెనీకి నీరు సరఫరా చేసేందుకు కే.ఎల్.ఎస్.ఆర్ కంపెనీ పైపులైన్ తీసుకెళ్లింది. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరుమీదుగా కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి వెంట తీసుకెళ్లారు. పైపులైన్ నాసిరకంగా పూడ్చడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్టీసీ బస్సుతో పాటు ఆయా వాహనాలు రహదారి నుంచి కిందకు దిగినప్పుడు ఇరుక్కుపోతూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం బ్రాహ్మణకొట్కూరు సమీపంలో కే.ఎల్.ఎస్.ఆర్ తీసిన కాల్వలో ఆర్టీసీ బస్సు ఇరుక్కుపోయి ఆర్టీసీ డ్రైవర్, కండెక్టర్, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రహదారి పక్కనే కాల్వ తీయడంతో గుంతలమయంగా మారింది. జిల్లా అధికారులు స్పందించి పైపులైన్ కాల్వను నాణ్యత మట్టితో పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

వాన జోరు..రైతుల బేజారు



జి.వీరాపురం గ్రామం వద్ద చెరువులను తలపిస్తున్న వరి పొలాలు



గువ్వలకుంట్ల చెరువు అలుగు వద్ద వలలతో చేపలు పడుతున్న జాలర్లు

కొత్తపల్లి: మూడు రోజుల నుంచి వాన జోరుగా కురుస్తుండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 10 గంటల వరకు ఎడతెరిపినివ్వకుండా జోరుగా వాన కురిసింది. పలు గ్రామాల రోడ్లు జలమయమయ్యాయి. మొక్కజొన్న, వరి పొలాలు నీట మునిగాయి. పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గువ్వలకుంట్ల, పాలెంచెరువులు జలకళను సంతరించుకున్నాయి. చెరువులలోని చేపలను కాపాడుకునేందుకు జాలర్లు తిప్పలు పడుతున్నారు. నందికుంట గ్రామంలోని కుంటలో గుర్రపుడెక్కతో నిండిపోయి మురుగు కాలువకు అడ్డుపడడంతో వర్షపునీరు ఎటూపోలేక రోడ్లపైకి వచ్చి చేరింది. పంచాయతీరాజ్ శాఖ ఏఈ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శులు పార్థసారధి, చిన్నస్వామి యాదవ్ అక్కడికి చేరుకుని గుర్రపుడెక్కను కూలీలతో తీయించి నీటిని వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.



నందికుంట గ్రామంలోని కుంటలో గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం

నిలిచిపోయిన రాకపోకలు



ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి నదిని పరిశీలిస్తున్న అధికారులు



ఆత్మకూరు-వడ్లరామాపురం వాగు పొంగడంతో నిలిచిపోయిన వాహనాలు

ఆత్మకూరు: మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి నది, రాళ్లవాగులను ఎంపీడీఓ ఉమర్, తహసీల్దార్ రత్నరాధిక, ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి బుధవారం పరిశీలించారు. మండలంలో బుధవారం 13.8 మి.మీ. వర్షం కురిసిందని, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భవనాశి, సుద్దవాగు, రాళ్లవాగు, వరదరాజస్వామి ప్రాజెక్టు పూర్తిగా నిండి ప్రమాద సూచికను దాటి వంతెనలపై ప్రవహిస్తున్నాయని, ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల ప్రజలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. కురుకుంద, వడ్లరామాపురం గ్రామాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

● మహానందిలో భక్తులకు అగచాట్లు



పంటపొలాల్లో నిలిచిన వర్షపునీరు

మహానంది: తుపాను ప్రభావంతో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షం విడవటం లేదు. ఉదయం నుంచి నిరంతరాయంగా వర్షం కురవడంతో మహానంది క్షేత్రంలో పెళ్లిళ్లు చేసుకునేందుకు వచ్చిన భక్తులు అవస్థలు పడుతున్నారు. వర్షం తగ్గకపోవడంతో నాగనంది వసతిగృహాలను అద్దెకు తీసుకున్న పెళ్లిళ్ల నిర్వాహకులు వసతిగృహాల లోపలి ప్రాంగణాల్లోనే వంటలు చేసుకోవాల్సి వచ్చింది. వరండాలో నూతన వధూవరులు పెళ్లి చేసుకున్నారు. మహానందీశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తులు వర్షంలోనే తడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. ఆలయ మహాద్వారం ముందు నీళ్లు నిలబడటంతో భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అధికారులు స్పందించి వర్షపునీరు నిలవకుండా సిమెంట్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ

నందికొట్కూరు: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ సూచించారు. గురువారం నంది జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు మార్గాలకు, వ్యసనాలకు అలవాటు పడితే జీవితాలు సర్వ నాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రూల్లా పాల్గొన్నారు.

అమెరికా షరతులకు తలొగ్గిన మోదీ

నందికొట్కూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా షరతులకు తలొగ్గడం సిగ్గుచేటని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ షరతుల కూడిన ప్రతులకు సీపీఎం నాయకులు బుధవారం పట్టణ ప్రధాన రహదారిపై నిప్పుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాకు దేశాన్ని తాకట్టు పెడితే సహించే ప్రసక్తే లేదన్నారు.

● ఆత్మకూరు: అమెరికాతో జీరో ట్యాక్స్ ఆహార ధాన్యాల దిగుమతుల కోసం ఫ్రీ ట్రేడింగ్ అగ్రిమెంట్‌ను వ్యతిరేకిస్తున్నామని సీపీఎం నాయకులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, యేసురత్నం అన్నారు. కొత్త బస్టాండు ఎదుట బుధవారం రైతు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. జీవో పత్రాలకు నిప్పు పెట్టారు. కార్యక్రమంలో నాయకులు సద్దాం, సురేంద్ర, రణధీర్, వీరన్న, మాబాషా, క్రిష్ణమోహన్, అంబయ్య, వలీ, శివన్న పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే అభివృద్ధి సాధ్యం

పగిడ్యాల: ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ సుమిత్రమ్మ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు పంచాయతీ అభివృద్ధి సూచికలపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీలు సమాన అభివృద్ధిని సాధించేందుకు ప్రణాళికలు ఎంతో ముఖ్యమన్నారు.

● జూపాడుబంగ్లా: పంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామప్రజలు కృషిచేయాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీపీ సువర్ణమ్మ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీల పురోగతి సూచిక 2.0 పరివర్తనపై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఏర్పాటు చేసిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో వారు మాట్లాడారు.

● వెలుగోడు: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా పంచాయతీలు పని చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక్క శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ శ్రీనివాసగౌడు, ఏఎస్ఓ లక్ష్మయ్య, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

● బండి ఆత్మకూరు: పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి కృషిచేయాలని ఎంపీడీఓ రామకృష్ణ వేణి, తహసీల్దార్ పద్మావతి సూచించారు. సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు.

● కొత్తపల్లి: ఎంపీడీఓ సమావేశ భవనంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అబ్దుల్ అల్లాం బాషా అధ్యక్షతన పంచాయతీ పురోగతిపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ ఉమారాణి పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తాం

● ఎంపీపీ తిరుపాలమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపాలమ్మ

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ తిరుపాలమ్మ అన్నారు. బుధవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. కోరం లేకపోవడంతో మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎంపీడీఓ ఉమర్ మాట్లాడుతూ మండలంలో పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పక్కీరయ్య మాట్లాడుతూ తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కురుకుంద, వడ్లరామాపురం గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరా కోసం రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. పశువైద్యాధికారి భువనేశ్వరి మాట్లాడుతూ పశువులకు టీకాలు వేస్తున్నామన్నారు. అనంతరం ఎంపీపీ తిరుపతమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సర్పంచులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించి, నీటిని సరఫరా చేయాలన్నారు. అంటువ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రత్నరాధిక పాల్గొన్నారు.

ఎయిడ్స్ పట్ల విద్యార్థులకు అవగాహన

ఆత్మకూరు: ప్రపంచంలో ఎయిడ్స్ మహమ్మారి ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పట్టిందని ఎయిడ్స్ నియంత్రణకు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని మెరిబా ప్రాజెక్టు మేనేజర్ జుల్ఫికర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మహానందిలో ట్రాఫిక్ కష్టాలు

● ప్రధాన రోడ్డుపైనే భక్తుల వాహనాలు
● అంబులెన్స్‌కు కూడా దారివ్వని పరిస్థితి



ట్రాఫిక్ జామ్ కావడంతో నిలిచిన అంబులెన్స్

మహానంది: మహానందిలో ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. లాడ్జీల యజమానులు పార్కింగ్ సౌకర్యం కల్పించకుండా గదులను అద్దెకు ఇస్తుండటంతో అద్దెకు తీసుకున్న భక్తులు తమ వాహనాలను ప్రధాన రోడ్డుపైనే ఆపుతున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కనీసం అంబులెన్స్‌కు కూడా దారివ్వలేని పరిస్థితి బుధవారం చోటు చేసుకుంది.

అనుమతులు లేని లాడ్జీలతో అవస్థలు

మహానంది దేవస్థానంలో దేవస్థానానికి చెందిన వసతి గృహాలు తక్కువగా ఉన్నాయి. ఏడాదికి రూ.20 కోట్ల ఆదాయం వస్తున్నా కేవలం 37 గదులు మాత్రమే నిర్మించారు. దీన్నే ఆసరాగా చేసుకున్న కొందరు.. ఈశ్వర్‌నగర్, పార్వతీపురం కాలనీల్లో వందల సంఖ్యలో లాడ్జీలు ఏర్పాటు చేసుకుని రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. కొన్నింటికి మినహా మరే లాడ్జీలకు అనుమతులు లేవు. కనీసం పార్కింగ్ స్థలం కూడా లేదు. మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలోని పార్వతీపురం కాలనీలో రోడ్డు వెంట ఉన్న ఇళ్లను లాడ్జీలుగా మార్చేశారు. మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు లాడ్జీల్లో గదులను తీసుకుంటారు. అయితే పార్కింగ్ లేకపోవడంతో లాడ్జీల నిర్వాహకులు వారి వాహనాలను ప్రధాన రోడ్డుపైనే ఆపించేస్తున్నారు. ఈ మార్గంలో వ్యవసాయ కళాశాల, వెంకటేశ్వర పశుపరిశోధనా స్థానం, గాజులపల్లె రైల్వేస్టేషన్ ఉన్నాయి. ఇదే దారిలో గాజులపల్లె మీదుగా గిద్దలూరుకు నిత్యం వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డుపైనే లాడ్జీలకు వచ్చిన వారి వాహనాలు ఆపుతుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పార్వతీపురంలోని మహానందీశ్వర స్వామి దేవస్థానం ముఖద్వారం నుంచి సుమారు కిలోమీటరు దూరం వరకు బుధవారం ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి లాడ్జీల నిర్వాహకులతో చర్చించి అద్దె గదుల కోసం వచ్చిన వారి వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని పార్వతీపురం కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీఎస్‌ఎంయూ డిపో కార్యదర్శి ఎం.ఎం.బాషా, డిపో అధ్యక్షులు కరిముల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిపో వద్ద బుధవారం ఆర్టీసీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందన్నారు. తమకు రావాల్సిన పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని, వేతన సవరణ ముగిసి రెండు సంవత్సరాలైనా నూతన కమిటీని ఎంపిక చేయడం సరికాదన్నారు. విజయవాడలోని గన్నవరం–2 డిపోకి చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లూలు సంస్థకు బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ డిపోను తరలించడం, ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలతో పాటు కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ డిపో ఎస్‌ఎంయూ నాయకులు ఎస్.ఆర్.రెడ్డి, హరినాథరెడ్డి, నిజాముద్దీన్, ఎంటీఎస్ రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాధవీలింగేశ్వర ఆలయ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

వెలుగోడు: మాధవరం గ్రామంలో ప్రజల సహకారంతో నూతనంగా నిర్మించిన మాధవీ లింగేశ్వర ఆలయ ప్రతిష్ట మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జూపాడుబంగ్లా: రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు బుధవారం గ్రామాల్లో దండోరా వేయించారు. మట్టిమిద్దెలున్న వారు రాత్రివేళల్లో ఇళ్లల్లో నిద్రించవద్దని హెచ్చరించారు. దూలాలు, దెంతెలు విరిగిన ఇళ్లల్లో, చిన్నపాటి వర్షం కురిసినా వెలుస్తున్న ఇళ్లల్లో ఉండవద్దని సూచించారు.

హైవే నాణ్యత అయోమయం!

జాతీయ రహదారి.. పేరు గొప్ప..

ఊరు దిబ్బ చందంగా తయారైంది. పదికాలాల పాటు మన్నికగా ఉండాల్సిన జాతీయ రహదారి మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఒక పక్క నిర్మాణం చేపడుతుండగానే మరోపక్క చిన్నపాటి వర్షానికే చీలికలు వస్తోంది. భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగించాల్సిన జాతీయ రహదారి నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలివ్వడంతోనే ఈ దుస్థితి దాపురించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు నెర్రెలిచ్చిన ప్రాంతాల్లో జేసీబీతో తూతూమంత్రంగా కంకర వేసి చేతులు దులుపుకుంటుండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● చిన్నపాటి వర్షానికే కుంగిన రహదారి
● తూతూమంత్రంగా మరమ్మతులు
● పట్టించుకోని అధికారులు



హై వేనిర్మాణం జరుగుతున్న ఫ్లై ఓవర్‌పై కుంగిన బీటీ రోడ్డు



రోడ్డు కుంగిన ప్రాంతంలో జేసీబీతో కంకర వేస్తున్న దృశ్యం

పాములపాడు: జాతీయ రహదారి 340సీ నిర్మాణంలో అడుగడుగునా నాణ్యతా లోపం కనిపిస్తోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో పనులు దక్కించుకున్న పీఎస్‌కే గుత్తేదారు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా పనులు చేస్తున్నారు. మండలంలోని రుద్రవరం గ్రామం వద్ద నిర్మాణం చేపడుతున్న అండర్ పాస్ వంతెనపై చిన్నపాటి వర్షానికే కుంగిన వైనం చూస్తుంటే ఏ మాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించారో తెలిసిపోతోంది. రహదారి నిర్మాణం ఇంకా పూర్తి కాక ముందే పలు చోట్ల ప్యాచీలు వేసిన దృశ్యాలు అడుగడుగునా దర్శనిమిస్తున్నాయి.

కుంగిన చోట పనులు

ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కుంగిన బీటీ రహదారి ప్రాంతాన్ని తెలుసుకున్న పీఎస్‌కే కంపెనీ వారు హడావుడిగా మరమ్మతులు చేపట్టారు. జేసీబీతో కంకరను తెచ్చి కుంగిన ప్రాంతంలో వేసి మమ అనిపించారు. ఇది చూసిన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదేంటయ్యా నిర్మాణం పూర్తి కాక మునుపే మరమ్మతులా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులేమయ్యారో..

హైవే నిర్మాణం పనులను పరిశీలించాల్సిన అధికారులు ఎక్కడున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హైవేపై వేగంగా వెళ్లే వాహనాకు ఇలాంటి నిర్మాణాల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ ఇచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి నాణ్యతపై రాజీ పడుతున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

భూ సేకరణ సమయంలో అధికారులు హడావుడి..

జాతీయ రహదారి పనులు త్వరగా ప్రారంభించేందుకు భూ సమస్యలున్న ప్రాంతాల్లో అధికారులు హడావుడి చేసి రైతులను ఒప్పించి భూ సేకరణ చేపట్టారు. సమస్య జఠిలంగా ఉన్న ప్రాంతాలకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు సైతం పలు మార్లు సందర్శించారు. సమస్య లేవనెత్తుతున్న రైతుల హైవే నిర్మాణం వల్ల ఉపయోగాలు, ప్రభుత్వ పనులకు అడ్డు చెప్పరాదని ఒప్పించి మరీ భూ సేకరణ చేపట్టారు. అయితే రహదారి నిర్మాణం నాణ్యత గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు, వాహన చోదకులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా ప్రయాణికులు, వాహన చోదకుల ప్రాణాల దృష్ట్యా అధికారులు హైవే నిర్మాణంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై నేషనల్ హైవే పీడీ పద్మను వివరణ కోరగా రుద్రవరం వద్ద అలాంటిదేమి లేదని, సైట్‌లో వాళ్లు ఉంటారని, వాళ్లతో మాట్లాడారని ఉచిత సలహా ఇవ్వడం గమనార్హం.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయ అధికారి

కొత్తపల్లి: రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రం సమీపంలోని మొక్కజొన్న, పత్తి, వరి పంటలను పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, వర్షపు నీటిని కాలువల చేసుకుని బయటకు పంపాలని సూచించారు. ఎకరాకు 20 కేజీలు యూరియా, 20 కేజీల పొటాషియం లేదా 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, 19 19 19 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

● నందికొట్కూరు: మండల పరిధిలోని వడ్డేమాన్, కోనేటమ్మపల్లి గ్రామాల పొలిమేరలో బుధవారం వ్యవసాయాధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు గిరీష్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుకోవాలన్నారు. మొక్కజొన్న పంట విత్తనం వేసేటప్పుడు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు.